క్లుప్తంగా

ప్రజలందరికీ విఘ్నాలు తొలగిపోవాలి


కొఠారు అబ్బయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే

దెందులూరు: ప్రజలందరి జీవితాల్లో విఘ్నాలు తొలిగిపోయి విజయాలు సిద్ధించాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆకాంక్షించారు. జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ ప్రజలందరికీ ఆయన వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలి

గణపవరం: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు సర్పంచ్‌లు సహకరించాలని గణపవరం ఎస్సై మణికుమార్ కోరారు. గణపవరం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మణికుమార్‌ను మండలంలోని పలువురు సర్పంచ్‌లు కలిసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్య తలెత్తినా, అసాంఘిక కార్యకలాపాలు జరిగినా వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఎస్సైను కలిసిన వారిలో సరిపల్లె, కొమ్మర, వరదరాజపురం, వెంకట్రాజపురం, జలికాకినాడ, ముప్పర్తిపాడు సర్పంచ్‌లు చనుమూరి దుర్గాభవాని, కుర్రెళ్ల వెంకటరత్నం, మల్లంపల్లిసురేష్, బాతు నాగేశ్వరదావు, కర్రి రాధాలక్ష్మి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ సూర్యబలిజ రాష్ట్ర అధ్యక్షుడిగా రాజా


మాజీ ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన శెట్టి రాజా

గణపవరం: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు అధ్యక్షుల నియామకాల్లో భాగంగా సూర్యబలిజ వర్గం రాష్ట్ర అధ్యక్షుడిగా గణపవరానికి చెందిన శెట్టి రాజా నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పంపిన నియామక పత్రాలు అందాయని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, సూర్యబలిజల అభ్యున్నతికి తనవంతు కృషి చేస్తానని ఈసందర్భంగా ఆయన తెలిపారు.

ముంగరకు రాష్ట్ర అధ్యక్ష పదవిపై హర్షం


ముంగర సంజీవ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అప్పన ప్రసాద్, మండల కొండలరావు

దెందులూరు: ముంగర సంజీవ్‌కుమార్ ఆధ్వర్యంలో వడ్డీల సామాజిక వర్గానికి మరింత మేలు జరగాలని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ అప్పన ప్రసాద్, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు పళ్ళెం ప్రసాద్, మండలి కొండలరావు అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం ముంగర సంజీవ్‌కుమార్‌ను శుక్రవారం జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం గంగరాజు, ఎంపీపీలు తాత రమ్యశ్రీ, బత్తుల రత్నకుమారి, పెన్మెత్స శ్రీనివాసరాజు, జెడ్పీవైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, తేరా ఆనంద్, జానంపేట ప్రసాదబాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పదవి ఇచ్చినందుకు పార్టీ అధినేత జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

జల దిగ్బంధంలో రెండు గ్రామాలు

పెదపాడు: గోగుంట, ఆర్‌పీపాలెం ప్రాంతాలు పూర్తి జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. గోగుంట గ్రామంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పరిశీలించి ట్రాక్టరుపై బాధితులను సురక్షిత ప్రాంతానికి తరలించి పునరావాసం కల్పించారు. వసంతవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాసం ఏర్పాటు చేశారు. వడ్డిగూడెం శివారు గ్రామమైన ఆర్‌పీపాలెం కాలనీ మొత్తం నీట మునగడంతో ఇంట్లో చిక్కుకున్న వాళ్లను తహసీల్దార్ ఎన్‌వీడీవీ ప్రసాదరావు పెదవేగి సీఐ నబీ, పెదపాడు ఎస్సై శుభశేఖర్ తన సిబ్బందితో కలిసి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

మాజీ ఎంపీ సురేష్ అరెస్టు అప్రజాస్వామికం

దెందులూరు: మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నందిగం సురేష్ అరెస్టు అప్రజాస్వామికమని ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్, వైఎస్సార్‌సీపీ ఏలూరు రూరల్ మండల అధ్యక్షుడు తేరా ఆనంద్, దెందులూరు, పెదవేగి మండలాల అధ్యక్షుడు జానంపేట ప్రసాద్‌బాబు, కామిరెడ్డి నాని, జెడ్పీటీసీలు నిట్టా లీలానవకాంతం, విజయ్‌బాబు, మండలి సరస్వతి అన్నారు. మాజీ ఎంపీ నందిగం సురేష్‌కు తామంతా అండగా ఉంటామని అన్నారు.

శిథిలావస్థలో శింగవరం బాలికల హాస్టల్


సింగవరంలోని సోషల్ వెల్ఫేర్ బాలిక హాస్టల్ వెనుకభాగం


పెచ్చులూడిన పైకప్పు


హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న బాత్‌రూమ్

- 100 మందికి నాలుగే బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు
- సమీప హైస్కూల్లో రాత్రి బస
- పట్టించుకోని ప్రభుత్వం

దెందులూరు: దెందులూరు మండలం సీతంపేట పంచాయతీ శింగవరంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. ఇక్కడున్న ఆరు బాత్‌రూమ్‌లలో నాలుగు, ఆరు మరుగుదొడ్లలో నాలుగు మాత్రమే పనిచేస్తున్నాయి. దీంతో ఇక్కడ వసతి పొందుతున్న ఆరు నుంచి 10వ తరగతి వరకు వంద మంది బాలికలు కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేదు. హాస్టల్ భవనం పైకప్పు శిథిలమవ్వడంతో విద్యుత్ కూడా సక్రమంగా రావడంలేదు. గతంలో పైకప్పు నుంచి పెచ్చులు ఊడిపడిపోవంతో హాస్టల్ ముందు నేలపై ప్లాస్టింగ్ చేయించి భోజనం, టిఫెన్ పెడుతున్నారు. హాస్టల్ భవనం శిథిలమవడంతో పక్కనే ఉన్న హైస్కూల్‌లో బాలికలు రోజూ రాత్రి పడుకుంటున్నారు. తెల్లవారిన తరువాత హాస్టల్‌కు వచ్చి డోర్లు లేని బాత్‌రూమ్‌ల్లోనే కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు తమ హాస్టల్ భవాన్ని పరిశీలించి, సౌకర్యాలు కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరగా తాను చార్జ్ తీసుకోకముందే హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమైందని, భోజనం, టిఫెన్ చేసేందుకు తన సొంత ఖర్చులతో హాస్టల్ భవనం ముందు నేలపై ప్లాస్టింగ్ చేయించానని హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కనకదుర్గ తెలిపారు. రాత్రివేళల్లో పక్కనే ఉన్న హైస్కూల్లో పిల్లలు పడుకుంటున్నారని చెప్పారు. ఐదు నెలల నుంచి బిల్లుల పెండింగ్ ఉన్నాయని వివరించారు.

- వట్లూరులోని బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 750 మంది బాలికలు ఉన్నారు. ఇక్కడ మరుగుదొడ్ల సమస్యగా ఉంది. ప్రణాళిక సిద్ధం చేసి అధికారులకు పంపినా ఇంకా అనుమతులు రాలేదు.

వసతులు అంతంత మాత్రమే


చేబ్రోలు ఎస్సీ బాలికలు వసతి గృహంలో భోజనాలు చేస్తున్న బాలికలు


శిథిలావస్థలో కైకరం ఎస్సీ బాలురు వసతి గృహం

ఉంగుటూరు: మండలంలో ఉన్న ఎస్సీ సంక్షేమ వసతి గృహాల్లో వసతులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. వసతులు లేమితో హాస్టల్స్‌లో ఉండే విద్యార్థులు సగానికి పైగా తగ్గిపోయారు. కరోనా తరువాత పరిస్థితి మరీ దారుణంగా మారిపోయింది. కైకరంలో ఎస్సీ బాలురు వసతి గృహం పూర్తిగా శిథిల స్థితికి చేరుకుంది. ప్రస్తుతం అక్కడ 60 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే బొమ్మిడిలో కేవలం 24 మంది మాత్రమే ఉంటున్నారు. వారు కూడా మేట్రిన్ బతిమిలాడి పిల్లలను తీసుకురావాల్సి వస్తోంది. ఉంగుటూరు ఎస్సీ బాలికల వసతి గృహం, చేబ్రోలు బాలికల వసతి గృహంలో కూడా బాలికలు తగ్గిపోయారు. వసతులపై మేట్రిన్ మీరాబాయి వివరణ అడగ్గా వసతలు బాగానే ఉన్నాయని , పిల్లలుబాగానే చేరారని వివరించారు.

ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించాలి


ఉత్తమ గురువులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు

గణపవరం: ఆదర్శవంతమైన సమాజాన్ని నిర్మించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ ఈపూరు సత్యనారాయణ అన్నారు. గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా గణపవరం, నిడమర్రు మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను లయన్స్ భవనంలో ఘనంగా సన్మానించారు. ఈ సభకు క్లబ్ అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులు ఎంఈవో కె.రాంబాబు, ఉపాధ్యాయులు ఎల్. ప్రసాదరావు (జల్లికొమ్మర), ఎ.ప్రసాదరాజు (ముప్పర్తిపాడు), బీవీబీఎస్ లక్ష్మి (జె.కాకినాడ) టి.సరస్వతి (జల్లికొమ్మర), లక్ష్మీనారాయణ (నిడమర్రు), కె.లలిత కుమారి (మందలపర్రు), సీహెచ్ శ్రీధర్ (తోకలపల్లి), జి.రామాంజీ (గణపవరం) లను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈకార్యక్రమంలో లయన్స్ రీజియన్ చైర్మన్ వెల్లంకి నరేష్, జిల్లా చైర్మన్లు కిలారి రవి, పోశింశెట్టి రామ్మూర్తి, క్లబ్ కార్యదర్శి సత్తినీడి నాని, కోశాధికారి కె.విశారద, క్లబ్ మాజీ అధ్యక్షుడు రావూరి నాగరాజు, కె.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కైకరం విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఉంగుటూరు: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని కైకరం జెడ్పీహైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఎంపికలు బ్రాహ్మణగూడెం జెడ్పీహైస్కూల్లో ఈ నెల 5న నిర్వహిస్తామన్నారు. పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికల్లో పాల్గొనగా, అండర్–16 కేటగిరిలో వందాని నాగసాయి పవన్‌కుమార్, బాలికల విభాగంలో గాలింకి లావణ్య ఎంపికయ్యారన్నారు. వీరు ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు అన్నవరంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాల్ బాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన జి.నా సుధ, పాపాయమ్మను హెచ్ఎం, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యులు అభినందించారు.

శాంతి సమాజ స్థాపనకు కృషి చేయాలి

గణపవరం: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని, శాంతి సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం గణపవరంలోని కల్వరి యాగం ప్రార్థన మందిరం 12వ వార్షికోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేద వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలే మేలు


ముప్పర్తిపాడులో మట్టి వినాయక ప్రతిమలు తయారుచేసిన విద్యార్థులు

భీమడోలు: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విద్యార్థులు కృషి చేస్తున్నారు. వినాయక చవితిను పురస్కరించుకుని దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల విద్యార్థులంతా శుక్రవారం మృత్తికా వినాయక విగ్రహాలను మట్టితో తయారు చేశారు. హెచ్ఎం ఎస్‌కే మస్తాన్ ఆధ్వర్యంలో తెలుగు టీచర్ దుర్గాప్రసాదిని విగ్రహాల తయారీపై చిన్నారులకు ప్రేరణ కల్పించారు.

ఉప్పాకపాడులో మట్టి గణపతులు

ఉంగుటూరు: ఉప్పాకపాడులో ఉపాధ్యాయులు అల్లు శ్రీను, పి.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతుల ప్రతిమలు తయారు చేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు మాకా రత్నకుమారి, ఉన్నీషా పాల్గొన్నారు.

అందరూ మట్టి గణపతిని పూజిద్దాం

గణపవరం: ముప్పర్తిపాడు యూపీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసి ఉపాధ్యాయులకు, గ్రామస్తులకు పంపిణీ చేశారు.

మట్టితో వినాయకుని ప్రతిమలు

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం శర్మ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో విద్యార్థులు బంక మట్టితో 35 వినాయక ప్రతిమలను ఉపాధ్యాయుల సహకారంతో తయారు చేశారు.

వర్షం దెబ్బకి పత్రి దుకాణాలు వెలవెల

భీమడోలు/గణపవరం: భారీ వర్షంతో వినాయక పత్రి దుకాణాలు వెలవెలబోయాయి. శుక్రవారం రాత్రి ఒక్కసారిగా కుండపోత వర్షం కురవడంతో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తెచ్చుకున్న వినాయక పత్రి తడిసిముద్దయ్యింది. వ్యాపారులు, ప్రజలు సైతం వర్షానికి ఇబ్బంది పడ్డారు. దీనితో వ్యాపారులు నిరుత్సాహ పడ్డారు.శనివారం వినాయక చవితి నేపథ్యంలో ఒక రోజు ముందుగా గ్రామాల్లో వినాయక పూజా సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. రోడ్లపై ఏర్పాటు చేసుకున్న దుకాణాలపై వరుణుడు ప్రతాపం చూపాడు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పత్రి దుకాణాల్లోని పత్రి, పూలు తడిసిపోయాయి. వర్షానికి జనం లేక మార్కెట్ వెలవెలబోయింది. దీనితో కొంతమంది పత్రి ధరలను పెంచేసారు. 6 రకాల పత్రిని కట్టలు కట్టి రూ.50లు విక్రయించారు. మూడు కలువ పువ్వులు రూ.20, మొక్కజొన్న పొత్తు రూ.20, కొబ్బరి కాయ రూ.25, వినాయక బొమ్మలు చిన్నవి రూ.100 నుంచి రూ.150, అరటిపండ్లు డజను రూ.80 నుంచి రూ.100, వివిధ రకాల కాయలు నారింజ, జామ, బత్తాయి, మారేడు, సీతాఫలం, వెలగకాయ, మొక్కజొన్న, తదితర కాయలు ఒక్కొక్కటి రూ.20 నుంచి రూ.30 వరకూ విక్రయించారు. పాలవెల్లులు, పూలదండల ధరలూ చుక్కలనంటాయి.

పాఠశాలల్లో సందడి

నిడమర్రు: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి గణనాథేలను పూజించాలంటూ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మట్టి వినాయకుని ప్రతి మలు తయారు చేశారు. తల్లిదండ్రులకు ఈ వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వీరికి ఉపాధ్యాయులు సహకరించారు.

పర్యావరణ హితం.. మట్టి వినాయక విగ్రహం


పూళ్లలో మట్టి వినాయక విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న కళాకారుడు


సిద్ధమైన పీవోపీ వినాయకుని విగ్రహాలు

- నేటి నుంచి గణేశ్ ఉత్సవాలు ప్రారంభం
- వాడవాడలా పండగ వాతావరణం

భీమడోలు: ప్రకృతి ఆరాధన నిబిడీకృతమైన పండుగ వినాయక చవితి. ఎంతోమంది ఈ విషయాన్ని పట్టించుకోకుండా హంగూ ఆర్భాటాలకు పోయి రసాయన రంగులతో కూడిన ప్లాస్టర్‌ఆఫ్‌పారిస్‌తో తయారు చేసిన భారీ గణనాథుని విగ్రహాలను నెలకొల్పుతున్నారు. మట్టితో వినాయకుని విగ్రహాలు చేసి నవరాత్రులు పూజలుచేసి వాటని చెరువులు, కుంటలు, నదుల్లో పూజాపత్రితో పాటు కలపడం వల్ల జలాలు శుద్ధి అవుతాయని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. భూమిలో లభించే మట్టితోనే గణేశ్ ప్రతిమను తయారు చేసి పూజించాలని పండితులు చెబుతున్నారు. దీనికి భిన్నంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన పెద్ద పెద్ద విగ్రహాలను జలవనరుల్లో కలిపి నీట కాలుష్యానికి కారణమవుతున్నారు.

దశాబ్దాలుగా మట్టి విగ్రహాలే తయారు చేస్తున్న కళాకారుడు

పూళ్లకు చెందిన విగ్రహాల కళాకారుడు యర్రవరపు బుల్లియ్య దశాబ్దాలుగా మట్టితోనే వినాయకులను తయారు చేస్తున్నారు. పర్యావరణం హితంగా ఉండే బంకమట్టి, సిమెంట్, సున్నంతో విగ్రహాలను తయారు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. బుల్లియ్య 3 నుంచి 6 అడుగుల ఎత్తు గల గణేశ్వరుని విగ్రహాలను వివిధ రూపాల్లో సుందరంగా తీర్చిదిద్ది ఆకర్షణీయ రంగులను అద్ది వాటిని విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

మట్టి విగ్రహాల వల్ల కలిగే ప్రయోజనాలు

సహజసిద్ధంగా లభించే బంకమట్టితో విగ్రహాలను తయారు చేయడం మంచిది. ఇవి నీటితో సులభంగా కరిగిపోతాయి. మట్టి విగ్రహాల నిమజ్జంతో జలచరరాశులకు ఎటువంటి నష్టం ఉండదు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో అనర్థాలు

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్యల్లో పర్యావరణ కాలుష్యం. సమస్త జీవకోటిపై దీని ప్రభావం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో విఘ్నాలు తొలగించే వినాయక చవితి మండపాల్లో ఎక్కువ సంఖ్యలో రసాయనాలతో తయారు చేసిన పీవోపీ విగ్రహాలే దర్శనమిస్తాయి. దీనితో కలిగే అనర్థాలు చాలా ఎక్కువ. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను చెర్వులు, కాల్వలు, నదుల్లో నిమజ్జనం చేసినా కరగవు. ఈ విగ్రహాల్లో జిప్సన్, గంధకం, మెగ్నీషియం, సీసం, పాదరసం, కాల్షియం, ఆర్గానిక్స్, కార్బన్ అవశేషాలుంటాయి. ఈ ప్రతిమలకు పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన జీవ, చలరాశులకు ప్రాణముప్పు వాటిల్లుతుంది. చర్మసంబంధ వ్యాధులు వస్తాయి. రసాయనాలు కలిగి రంగులు అద్దిన విగ్రహాలను నీటితో నిమజ్జనం చేయడంతో ఆ నీటిని పంటపొలాలకు వినియోగించడం వల్ల ఆహారోత్పత్తులు కూడా కలుషితమవుతాయి. ఆ విగ్రహాలను కొన్నేళ్లుగా పాటు వినియోగిస్తే నేల, నీరు, గాలి అన్నింటిపైనా కాలుష్య ప్రభావం ఉంటుంది.

7వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం

ఈనెల 7వ తేదీ నుంచి 9 రోజుల పాటు వాడవాడలా గణేశ్ ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాల్లోని పల్లెలు, పట్టణాల్లో వందలాది విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీలు చవితి వేడుకలు పూర్తి అయ్యే వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మట్టి వినాయకుడినే పూజిద్దాం



పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. తెలుగు ప్రజలంతా వాడవాడలా వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితం కాంక్షిస్తూ జరుపుకోవాలి. మట్టి వినాయకునికి పూజలు చేద్దాం. రసాయనాలతో తయారు చేసే పీవోపీ విగ్రహాలకు దూరంగా ఉందాం. చెరువులు, కాలువలు, నదుల్లో రసాయన పదార్థాలతో తయారయ్యే విగ్రహాలను నిమజ్జనం చేస్తే పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది. మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుంది.

– తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, మానవత జిల్లా డైరెక్టర్, భీమడోలు

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి


చవితి ఉత్సవాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ సుభాష్

గణపవరం: నిడమర్రు పోలీస్ సర్కిల్ పరిధిలోని వినాయక చవితి ఉత్సవాలను కమిటీ సభ్యులు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. గణపవరం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం గణపవరం, నిడమర్రు మండలాలలోని వినాయకచవితి ఉత్సవ నిర్వాహకులతో ఎస్సై మణికుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

భీమడోలు: చవితి వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భీమడోలు సీఐ బీబీ రవికుమార్ అన్నారు. భీమడోలు పోలీస్‌స్టేషన్ ప్రాంగణం వద్ద శుక్రవారం సాయంత్రం ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులకు పోలీసులు, అగ్నిమాపక, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై వై.సుధాకర్ అధ్యక్షత వహించారు. ఆర్ఐ కిరణకుమారి, ఏఈ రామస్వామి, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాసరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.

నిడమర్రు ఎంఈవో-2గా బాలయ్య బాధ్యతల స్వీకరణ

నిడమర్రు: మండల ఎంఈవో-2గా గొర్రెల బాలయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి నుంచి ఆదేశాల మేరకు నియామక పత్రాన్ని ఎంఈవో-1 పుచ్చల శేషు అందించారు. ఇప్పటి వరకూ నిడమర్రు మండల ఎంఈవో-2గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.రాంబాబు గత నెల 31న పదవీ విరమణ చేయడంతో గణపవరం మండల ఎంఈవో-2గా ఉన్న గొర్రెల బాలయ్యను ఉన్నతాధికారులు నిడమర్రు మండల ఎంఈవో-2గా ఆదనపు బాధ్యతలు అందించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో ఆయనకు అభినందనలు తెలిపారు. దీంతో గణపవరం మండలం ఎంఈవో-1, ఎంఈవో-2 ఇరువురు నిడమర్రు మండలం ఎంఈవో-1, ఎంఈవో-2 గా ఆదనపు విధులు నిర్వహించనున్నారు.

వరద బాధితులకు సహాయం

ఉంగుటూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని నీలాద్రిపురం కూటమి పార్టీల శ్రేణులు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలను శుక్రవారం వాహనంపై పంపించారు. ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు క్యాంపు కార్యాలయం వద్ద వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

బాధితులకు ఆపన్నహస్తం

భీమడోలు: విజయవాడలోని వరద బాధిత కుటుంబాలకు సేవార్థం గుండుగొలనుకు చెందిన మధుబాబు ఫౌండేషన్ ఆపన్నహస్తాన్ని అందించింది. శుక్రవారం విజయవాడలోని 1,700 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు, బిస్కెట్లు, పాల ప్యాకెట్లు, బ్రెడ్లు, వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ముందుగా విజయవాడ వెళ్తున్న వాహనాలకు భీమడోలు తహసీల్దార్ బి.రమాదేవి జెండా ఊపి ప్రారంభించారు. మధుబాబు కుమారులు కృష్ణ ప్రసాద్ వర్మ, రామ్‌ప్రసాద్‌వర్మ సేవలను పలువురు కొనియాడారు.